నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ మంగళవారం 30 జూలై 2024 | ADILABAD NIRMAL



గుంతల రోడ్డుపై వెళ్తున్న వాహనాలు

# నరకయాతన

- ఆదిలాబాద్-మహారాష్ట్ర రోడ్డు నిర్మాణంలో జాప్యం
- గుంతలమయంగా రహదారి
- నిత్యం వేలాది వాహనాల రాకపోకలు
- ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలి

ఆదిలాబాద్, జూలై 29(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా గ్రామీణ రోడ్లతోపాటు పట్టణానికి సమీపంలో ఉన్న రహదారులు, అంతర్రాష్ట్ర రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. గతేడాది కురిసిన భారీ వర్షాలతో ఆదిలాబాద్-మహారాష్ట్రలోని చంద్రాపూర్ మధ్యలో ఉన్న జాతీయ రహదారి జైనథ్ మండలంలోని తర్నం వద్ద ఉన్న వంతెన కుంగిపోయింది. దీంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జైనథ్, బేల మండలాలతోపాటు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.40 కోట్లతో 14 కిలోమీటర్ల మేర సీసీఐ ఎక్స్‌రోడ్డు, లాండసాంగ్వి, అర్లి మీదుగా నీరాల మీదుగా రోడ్డు మంజూరు చేసింది.

## పనుల్లో తీవ్ర జాప్యం

రెండు రాష్ట్రాల ప్రజల సౌకర్యార్థం నిర్మించిన ఆదిలాబాద్, నీరాల రోడ్డు పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. గతేడాది సెప్టెంబరులో ప్రారంభమయ్యాయి. జాతీయ రహదారుల రాష్ట్రశాఖ అధికారులు ఈ పనులను పర్యవేక్షిస్తుండగా 12.5 కిలోమీటర్ల మేర నిర్మాణ పనులు పూర్తికాగా సీసీఐ ఎక్స్‌రోడ్ నుంచి కిలోమీటర్ వరకు పనులు నిలిచిపోయాయి. వానకాలం ప్రారంభమైనప్పటి నుంచి పూర్తి కాని రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి వర్షం నీరు నిలుస్తున్నది. జిల్లా కేంద్రంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు, కార్లు, మోటార్ సైకిళ్లతోపాటు సరుకుల రవాణా చేసే వాహనాలు వేల సంఖ్యలో ఈ రోడ్డుపై నుంచి రాత్రి, పగలు రాకపోకలు సాగిస్తాయి. తర్నం వంతెన మూసివేయడంతో జైనథ్, బేల మండలాల ప్రజలు వైద్యం, వ్యవసాయం ఇతర పనుల కోసం ఈ రోడ్డుపై నుంచి వెళ్లాల్సి ఉంటుంది. రోడ్డు ప్రమాదకరంగా మారడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. సీసీఐ ప్రాంతంలో రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలు ఉండడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారని గ్రామాల ప్రజలు అంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులను రోడ్డు సమస్య పరిష్కారం కోసం పలు మార్లు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పట్టణానికి ఆనుకుని ఉన్న రహదారులు పరిస్థితి ఇలా ఉంటే మారుమూల గ్రామాల రోడ్ల గురించి ఎవరూ పట్టించుకుంటారని ప్రజలు అంటున్నారు.

### ఇబ్బందులు పడుతున్నాం..



జైనథ్ మండలంలోని తర్నం బ్రిడ్జి పాడయినప్పటి నుంచి బేల, జైనథ్ మండలాల నుంచి ఆర్లి, లాండ సాగ్వీ మీదుగా ఆటోలు నడుపుతున్నాం. సీసీఐ క్రాస్ రోడ్డు ఆదిలాబాద్ వరకు రోడ్డుపై పెద్ద, పెద్ద గుంతల్లో నీరు నిలుస్తున్నది. ఆటోలో ప్రయాణికులను తీసుకుపోతుంటే ఎప్పుడు ఏమి జరుగుతుందో అని భయపడుతున్నాం. ఏడాది నుంచి ఇదే పరిస్థితి ఉంది. గుంతల నుంచి ఆటో పోతుండడంతో రోజు రిపేర్ చేయాల్సి వస్తుంది. దీంతో మాకు ఉపాధి లేకుండా పోతుంది.

*- పొచ్చిరాం, ఆటో డ్రైవర్, సాంగిడి*

### ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి..



నేను ఆదిలాబాద్-మహారాష్ట్ర మీదుగా రోజు సరుకులను చేరవేస్తుంటా. ఏడాది నుంచి ఈ రోడ్డుపై ప్రయాణం నరకాన్ని తలపిస్తున్నది. రోడ్డుపై గుంతల కారణంగా వాహనాలు ప్రమాదకర పరిస్థితుల్లో వెళ్తున్నాయి. ఒక వాహనం పోయిన తర్వాత మరో వాహనం వెళ్లాల్సి వస్తుంది. రహదారి నిర్మాణం విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

*- వైభవ్, వ్యాన్ డ్రైవర్, మహారాష్ట్ర*

# విద్యాశాఖలో ఎస్జీటీలకు ప్రమోషన్లు

## 43 మంది వివిధ పాఠశాలలకు బదిలీ




ఎదులాపురం, జూలై 29 : ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీలకు ప్రమోషన్లు కల్పిస్తూ జిల్లా విద్యాధికారి ప్రణీత ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని వివిధ సబ్జెక్టుల్లోని ఖాళీగా ఉన్న పోస్టుల్లో వీరిని స్కూల్ అసిస్టెంట్‌లుగా నియమించారు. రోస్టర్ పాయింట్లు, ఇతర అంశాల ఆధారంగా బదిలీ ప్రక్రియ నిర్వహించారు. ఉపాధ్యాయుల పదోన్నతులతో పలు పాఠశాలల్లో వివిధ సబ్జెక్టు టీచర్ల నియామకం జరిగినట్లు అయింది. ప్రమోషన్లు పొంది ఆయా పాఠశాలలకు బదిలీ అయిన ఉపాధ్యాయులు తమకు కేటాయించిన స్కూళ్లలో చేరాల్సి ఉంటుందని విద్యాశాఖ అధికారులు సూచించారు.



# స్థానికం కష్టమే..

## ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే అవకాశాల్లేవు..

- కోర్టు తీర్పు అమలు చేయాల్సి ఉంది..
- బీసీ కమిషన్ నివేదిక సమర్పించాకే నోటిఫికేషన్
- ఈ పనులు అయ్యేందుకు సమయం పట్టే చాన్స్
- ఆగస్టులో ఎన్నికలంటూ ప్రచారంతో అప్రమత్తమైన లీడర్లు
- జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు పెంచితేనే బీసీలకు మేలు
- సర్పంచ్, వార్డు మెంబర్ పదవులకు పెరగనున్న పోటీ
- ఎన్నికల కోసం ఎదురు చూపులు.. టికెట్ల కోసం పట్టు..




మంచిర్యాల, జూలై 29(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : స్థానిక సంస్థల ఎన్నికలపై ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సాధ్యమైనంత త్వరగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. దీంతో ఆగస్టులో పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ వస్తుందంటూ తెగ ప్రచారం జరిగింది. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఇదే చర్చ నడిచింది. దీంతో ఆశావహులు అప్రమత్తమయ్యారు. ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయా అని ఎదురుచూసుకుంటూ, ఎలాగైనా సర్పంచ్ లేదా వార్డు మెంబర్ టికెట్లు దక్కించుకోవాలనే పట్టుదలతో భవిష్యత్ కార్యాచరణకు సిద్ధం అవుతున్నారు. ఇలాంటి తరుణంలో ఆగస్టులో ఎన్నికలు ఉండకపోవచ్చనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 2019లో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే సమయంలో సుప్రీంకోర్టు కొన్ని షరతులు విధించింది. ముందు బీసీ రిజర్వేషన్లు ఖరారు చేశాకే ఎన్నికలు నిర్వహించాలని స్పష్టం చేసింది. కాకపోతే అప్పటికప్పుడు బీసీ కమిషన్ ఈ ప్రక్రియ పూర్తి చేయలేదన్న ఉద్దేశంతో మినహాయింపు ఇచ్చి, ఈసారి స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్ ఖరారును తప్పనిసరి చేసింది. బీసీ రిజర్వేషన్లు ఖరారు చేయడానికి నియమించిన కమిషన్ ముందు ట్రిపుల్ టెస్టు చేసి నివేదిక ఇవ్వాలి. అదయ్యాకే బీసీ రిజర్వేషన్లు ఫైనల్ చేసి ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ.. ఇప్పటి వరకు బీసీ కమిషన్ ఎలాంటి పనులు చేయపట్టలేదని తెలుస్తున్నది. ఇప్పటికిప్పుడు ఈ ప్రక్రియ మొదలుపెట్టినా అంతా పూర్తయి, ఎన్నికల దాకా రావాలంటే కనీసం రెండు నెలల సమయం పట్టనుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయనే ఆశలు పెట్టుకోకపోవడమే మంచిదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### లోక్‌సభ ఓటరు జాబితా ప్రామాణికంపై వ్యతిరేకత

స్థానిక సంస్థల ఎన్నికలకు ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో వినియోగించిన ఓటర్ల జాబితాను ప్రాతిపాదికగా తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘాన్ని లిస్టు ఇవ్వాలని కోరింది. తెలంగాణతోపాటు మరో ఐదు రాష్ట్రాలకు ఈ జాబితా ఇచ్చేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఓకే చెప్పింది. ఈ మేరకు కేంద్రం నుంచి అతి త్వరలోనే ఎన్నికల జాబితా వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాగా.. ఈ ఓటరు జాబితాను ప్రతిపాదికగా తీసుకుని బీసీ రిజర్వేషన్లు ఖరారు చేస్తే ఊరుకునేది లేదని ఇప్పటికే బీసీ సంఘాలు చెప్తున్నాయి. జనాభా ప్రతిపాదికన తీసుకునే రిజర్వేషన్లు ఫైనల్ చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మొండికేసి ముందుకెళ్తే న్యాయపరమైన చిక్కులు తప్పవనే చెప్పాలి. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికలకు వెళ్లడం కన్నా.. బీసీ కమిషన్ నివేదిక ఇచ్చాకే రిజర్వేషన్లు ఖరారు చేసుకుని న్యాయపరమైన చిక్కులు రాకుండా ముందుకెళ్తేనే మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### మొదలైన సందడి

ఆగస్టులో ఎన్నికలంటూ సోషల్ మీడియాలో జరిగిన ప్రచారంతో గ్రామాల్లో సర్పంచ్ పదవుల సందడి మొదలైంది. ఆశావహులు అన్ని రకాల అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారు. ఎలాగైనా టికెట్ దక్కించుకోవాలనే ఉద్దేశంతో ఇప్పటి నుంచే ప్రణాళికలు రచిస్తున్నారు. ఓటర్లను బుట్టలో వేసుకునేందుకు ఏం చేయాలా అని ఆలోచనలు, చర్చలు గ్రామాల్లో జోరందుకున్నాయి. కొందరైతే చేస్తున్న ఉద్యోగాలు మానేసి మరీ ఎన్నికల కోసమంటూ ఊర్లకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1509 గ్రామపంచాయతీలు ఉండగా, 12,703 వార్డులు ఉన్నాయి. దీంతో అధికార పార్టీ నుంచి ప్రతిపక్ష పార్టీలు అన్నీ కలుపుకుని వేలాది మంది మంది స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారు. బీసీలకు రిజర్వేషన్లు పెరిగే అవకాశం ఉండడంతో ఆశావహులు ఎక్కువయ్యారు. గ్రామంలో సర్పంచ్ టికెట్ బీసీలకు ఇస్తే ఒక్కో గ్రామంలో ఐదు నుంచి పది మంది వరకు పోటీలో నిలుబడే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఇది రాజకీయ పార్టీలకు తలనొప్పిగా మారనుంది. ముఖ్యంగా అధికార పార్టీ కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ ఇబ్బందులు రానున్నాయి. ఇటీవల పార్టీలో చేరిన వారు, ఎప్పటి నుంచి పార్టీ కోసం పని చేస్తున్న వారికి మధ్య తీవ్రమైన పోటీ ఉండనుంది. టికెట్ దక్కని నాయకుల అసమ్మతితో కొత్త చిక్కులు వచ్చిపడనున్నాయి. వీటన్నింటినీ సరి చేసుకునేందుకు చాలా సమయం అవసరం అవుతుంది. అందుకే ముందస్తు ఎత్తుగడలో భాగంగానే స్థానిక ఎన్నికలంటూ అధికార పార్టీ ప్రచారానికి తెరలేపిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నది. ఇప్పటికే అభ్యర్థుల విషయంలో పూర్తి క్లారిటీతో ఉన్న బీఆర్ఎస్ ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా దూసుకుపోయేందుకు సిద్ధం అవుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఎన్నికల ప్రక్రియ ఎటుపోయి ఎటు తిరుగుతుందో చూడాలి మరి.

### కులగణన చేశాకే ఎన్నికలు నిర్వహించాలి..



రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణన చేపట్టాకే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలి. ఈ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పెంచాలి. జనాభాలో సగం ఉన్న బీసీలు రాజకీయంగా అనాధిగా అణగదొక్క బడుతున్నాయి. పదవుల కేటాయింపుల్లో తీరని అన్యాయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలి. ఈ విషయంలో ఎట్టి పరిస్థితుల్లో వెనక్కి తగ్గేది లేదు. అవసరమైన ఉద్యమాలు చేసేందుకు బీసీలు సిద్ధంగా ఉన్నారు.

*- చంద్రమోహన్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మంచిర్యాల.*




క్యూలైన్‌లో రోగులు

*వానకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. రిమ్స్‌కు ఏజెన్సీ ప్రాంతాల నుంచి జ్వరపీడితులు అధికంగా వస్తున్నారు. సాధారణంగా రోజు 600-800 వరకు ఔట్ పేషెంట్లు వస్తుంటారు. కానీ.. సోమవారం దాదాపు 1100లకుపైగా ఔట్ పేషెంట్లు వచ్చారు. దీంతో దవాఖాన జ్వరపీడితులు, రోగులతో కిటకిటలాడింది. వైద్యుల వద్దకు బారులుదీరారు. ఒక్కొక్కరు రెండు నుంచి మూడు గంటల వరకు వేచి ఉన్నారు.*

*- ఎదులాపురం, జూలై 29*



మహిళను తాడు సహాయంతో వాగు దాటిస్తున్న యువకులు



చిత్తబట్ట వాగును ఎడ్లబండితో దాటుతున్న రైతు సాక్రే రాము

## వాగు దాటాలంటే.. సాహసం చేయాల్సిందే..

*పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. తండాలు, గూడేలు, మారుమూల పల్లెల నుంచి గిరిజనులు, ప్రజలు మండల కేంద్రాలకు రావడానికి అవస్థలు పడుతున్నారు. సోమవారం గౌరాపూర్ పంచాయతీ పరిధిలోని చిత్తబట్ట గ్రామానికి చెందిన గ్రామస్తులతోపాటు యువకులు తాడు సహాయంతో చిత్తబట్ట వాగును దాటి గౌరాపూర్‌కు చేరుకున్నారు. మండల కేంద్రంలో వారసంత కావడంతో నిత్యావసర సరుకులతోపాటు కూరగాయలు, ఇతర పనుల నిమిత్తం గ్రామం నుంచి బయటకు రావాలంటే తప్పకుండా ఆ వాగును దాటాల్సిందేనని ఆదివాసులు వాపోయారు. వారసంతలో పనులు ముగించుకున్న తర్వాత తిరుగు ప్రయాణంలో వరద ఉధృతి పెరగడంతో బంధువుల ఇండ్ల వద్ద వాహనాలు పెట్టి మళ్లీ తాడు సాయంతో వాగు దాటి ఇంటికి చేరుకున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు కూడా ఎండ్లబండ్ల సాయంతో చేల వద్దకు వెళ్తున్నారు.*

*- ఇంద్రవెల్లి, జూలై 29*

# అటకెక్కిన గొలుసు కట్టు చెరువుల సర్వే

## డీజీపీఎస్ సర్వేతో తేలనున్న ఆక్రమణలు

- రెండు చెరువులకే పరిమితంపై అనుమానాలు
- రికార్డుల ఆధారంగా విస్తీర్ణత నిర్ధారణ
- సర్వే, హద్దులు లేక ఆగని ఆక్రమణలు



నిర్మల్‌లోని ధర్మసాగర్ చెరువు



భాగ్యనగర్ చెరువు శిఖంలో ఇంటి నిర్మాణం కోసం పిల్లర్లు వేసిన ఆక్రమణదారు

నిర్మల్, జూలై 29(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లా కేంద్రంలోని చారిత్రక గొలుసుకట్టు చెరువుల రక్షణ కోసం సంబంధిత అధికారులు కొద్ది రోజుల క్రితం డీజీపీఎస్(డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) సర్వేను తెరపైకి తెచ్చారు. ఈ డీజీపీఎస్ పరికరం శాటిలైట్‌తో అనుసంధానమై భూముల హద్దులను పక్కాగా నిర్ధారిస్తున్నది. ముఖ్యంగా చెరువు భూముల విస్తీర్ణాన్ని కచ్చితత్వంతో కొలిచేందుకు ఈ పరికరం ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు వెల్లడించారు. దీని సర్వే ఆధారంగా చెరువుల శిఖం, ఎఫ్టీఎల్, బఫర్ జోన్ భూములకు రక్షణ ఏర్పడుతుందని అధికారులు ప్రకటించారు. ఇటీవలే ఈ డీజీపీఎస్ పరికరాన్ని శాటిలైట్‌తో అనుసంధానం చేసి ఇక్కడి రెండు చెరువు భూముల సర్వే పూర్తి చేశారు. ప్రస్తుతం ఉన్న రికార్డులు, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా డీజీపీఎస్ పరికరం ఈ చెరువు భూముల హద్దులను శాటిలైట్ సహకారంతో నిర్ధారించింది. అయితే ఈ పరికరం ద్వారా చేపట్టిన సర్వే నివేదికలు ఇకపై అధికారికం కానున్నాయని, ఈ నివేదికల ఆధారంగా ఇప్పటి వరకు భూమి హద్దులపై నెలకున్న సందేహాలు తొలిగిపోతాయని అధికారులు చెబుతున్నారు. అలాగే ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న వివాదాలకు ఈ సర్వే ద్వారా పరిష్కారం లభించనున్నదంటున్నారు. మొదట నిర్మల్‌లోని కంచరోని చెరువు, కురన్నపేట్ చెరువు విస్తీర్ణాన్ని డీజీపీఎస్ ద్వారా సర్వే చేసి హద్దులను నిర్ధారించారు. ఆక్రమణకు గురైన భూములను గుర్తించి ఈ హద్దుల ఆధారంగా ట్రెంచ్‌లను ఏర్పాటు చేశారు. రాబోయే రోజుల్లో మిగతా గొలుసుకట్టు చెరువుల విస్తీర్ణాలను కూడా డీజీపీఎస్‌తో సర్వే చేసి హద్దులను నిర్ధారించడమే కాకుండా కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటామని అప్పట్లో ప్రకటించారు. ఈ సర్వేను రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతోపాటు అప్పటి జిల్లా కలెక్టర్ నేతృత్వంలో సంయుక్తంగా చేపట్టారు. అయితే ఈ పద్ధతిలో సర్వేను కేవలం రెండు చెరువులకు మాత్రమే పరిమితం చేసి, మిగతా పది చెరువుల సర్వే చేపట్టకపోవడం కబ్జాదారులకు వరంగా మారుతున్నది. సాంకేతికంగా చెరువు భూముల హద్దులను గుర్తించకపోవడంతో ఇష్టారాజ్యంగా శిఖం, ఎఫ్టీఎల్, బఫర్ జోన్ భూముల ఆక్రమణలు యథేచ్ఛగా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ కబ్జాల కారణంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని గొలుసుకట్టు చెరువుల రూపురేఖలే అదృశ్యం అవుతున్నాయన్న విమర్శలున్నాయి.

### మిగతా చెరువుల సర్వేపై అనుమానాలు

నిర్మల్ జిల్లా కేంద్రంలోని అన్ని గొలుసుకట్టు చెరువు భూముల రక్షణకు డీజీపీఎస్ సర్వేను అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో నిమ్మనాయుడు కాలంలో ఈ చారిత్రక గొలుసుకట్టు చెరువులను బహుళ ప్రయోజనాల కోసం నిర్మించిన సంగతి తెలిసిందే. అయితే చాలా రోజులుగా నిర్మల్ పట్టణం చుట్టూ ఉన్న ఈ చెరువులు కబ్జాకు గురవుతూ వస్తున్నాయి. ఇటీవలి కాలంలో నిర్మల్ పట్టణం జిల్లా కేంద్రంగా మారిన తర్వాత ఈ కబ్జాల పర్వం తారాస్థాయికి చేరింది. పలుకుబడి, పరపతి గల వ్యక్తులు ఈ చెరువు భూములను ఆక్రమించి భారీ నిర్మాణాలు చేపట్టారు. మరికొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువు భూముల్లో పట్టాలు సృష్టించి వెంచర్లుగా మార్చారు. దీనిపై నిర్మల్‌కు చెందిన ఓ సీనియర్ న్యాయవాది కొద్ది రోజుల క్రితం హైకోర్టులో పిల్ వేశారు. దీనిపై హైకోర్టు స్పందించి చెరువు భూములను సర్వే చేసి ఆ భూములను రక్షించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన అప్పటి కలెక్టర్ గొలుసుకట్టు చెరువు భూముల సర్వేకు డీజీపీఎస్ పరికరాన్ని తెరపైకి తెచ్చారు. ఈ పరికరం ద్వారా నిర్మల్‌లోని కంచరోని చెరువు, కురాన్నపేట్ చెరువు భూముల సర్వేను ఇప్పటికే పూర్తి చేశారు. అయితే సర్వేను కేవలం రెండు చెరువులకే పరిమితం చేయడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణాన్ని ఆనుకుని ఉన్న ప్రధాన చెరువులైన ధర్మసాగర్, మంజులాపూర్ రాంసాగర్, సీతా సాగర్, కొత్త చెరువు, గొల్లపేట్ చెరువు, పల్లె చెరువు, ఖజాన చెరువు, బంగల్‌పేట చెరువు భూములను సర్వే చేయకపోవడం కబ్జాదారులకు వరంగా మారింది. మళ్లీ డీజీపీఎస్ సర్వే జరిపి ఆయా చెరువు భూముల వాస్తవ విస్తీర్ణాన్ని నిర్ధారించి, ఆక్రమణలకు గురైన విలువైన భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

### చెరువుల విస్తీర్ణం

ప్రస్తుతం అధికారుల వద్ద ఉన్న చెరువు భూముల రికార్డులకు వాస్తవ పరిస్థితులకు భారీగా తేడా ఉన్నట్లు చెబుతున్నారు. అడ్డగోలుగా జరిగిన ఆక్రమణలు, కబ్జాలతో ఈ చెరువు భూముల విస్తీర్ణం 50శాతానికి పైగా కనుమరుగైందన్న ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ అధికారుల లెక్కల ప్రకారం.. బంగల్‌పేట్ చెరువు 210.32 ఎకరాలు, ఖజాన చెరువు 98.22 ఎకరాలు, కొత్తచెరువు 33.11 ఎకరాలు, రాంసాగర్ చెరువు 37.23 ఎకరాలు, కురన్నపేట్ చెరువు 76.18 ఎకరాలు, సీతాసాగర్, గొల్లపేట్ చెరువులు 48.11 ఎకరాలు, ఇబ్రహీం చెరువు 76.18 ఎకరాలు, కంచరోని చెరువు 74.19 ఎకరాలు, ధర్మసాగర్ చెరువు 65.10 ఎకరాలు, మోతి తలాబ్ చెరువు 132.06 ఎకరాలు, మంజులాపూర్ చిన్నచెరువు 81.34 ఎకరాల విస్తీర్ణం ఉన్నట్లు అధికారుల వద్ద ఉన్న రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఈ విస్తీర్ణం నుండి పెద్ద ఎత్తున ఆక్రమణలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయా చెరువులను కూడా కొత్త టెక్నాలజీ ప్రకారం డీజీపీఎస్ సర్వే జరిపినట్లయితే మొత్తం భూముల విస్తీర్ణానికి సంబంధించిన వివరాలు, భూముల్లో జరిగిన ఆక్రమణల లెక్కలు కూడా వెల్లడవుతాయంటున్నారు. అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకుని విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.